# నిర్భాగ్య ప్రేమికుడు

రచన:
కె. వి. రమణ

(గత సంచిక తరువాయి)

'ఎందుకు?'

'నిర్మల ధనవంతురాలు, ధనవంతు లమ్మాయిని వివాహం చేసికుంటే నీవుకూడ వొక ధనవంతువయి పోగా మని.'

'సరోజా? నాకా వుద్దేశ్యం లేనేలేదు. ప్రేమను నీవు డబ్బుతో లెక్కిస్తున్నావు.'

'లేదు. మరి నాకోరికను తీర్చరాదూ?'

'మొదటనే చెప్పానుగా - పురుషుని హృదయంలో ఒక్క స్త్రీకే స్థానముంటుంది!'

'సత్యం! యీ విషయం జాగ్రత్తగా ఆలోచించు. నేను నీ కంటె చిన్నదాన్ని. నీకు నీతులు నేర్పవలసిన దాన్నికాను. అయినాసరే నీకు నేనొక చిన్నసలహా నిస్తున్నాను. నా స్వార్థంకోసం కాదు. నిర్మల ధ న వ ం తు లమ్మాయి. నీవు ఆమెను ప్రేమిస్తున్నావు. ఆ సంగతి ఆమె నాన్నగారికి తెలియదు. నీవు బీదవాడివి. అందు చేతనే వాళ్ళ నాన్నగారు నీకు ధనసహాయం చేస్తున్నారు. ఈ విషయం అతనికి తెలిసినట్లయితే తరువాత ఏమి చేస్తాడో జాగ్రత్తగా ఆలోచించు. మరి నేవెళ్తాను.' అని చెప్పి సరోజ వుద్యానవనం నుండి నిరమించింది.

సత్యం ఆమె చెప్పిన మాటలను వల్లె వేసుకుంటూ, జరిగిన సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకుంటూ, ఆమె వెళ్ళిన వైపే చూడనారంభించాడు. అంతులేని వేదనతో ఆశలతో ఆకాశ వీధివైపు తన ముఖాన్ని తిప్పాడు.

అంతవరకు జరిగిన సంఘటనల్ని చూసిన చంద మామ, తనవైపు సత్యం ముఖాన్ని త్రిప్పగానే, అతని ఖిన్న వదనాన్ని చూడలేక మబ్బుల చాటున వెళ్ళి దాక్కుంది. వెన్నెల విహీనంలో సత్యం ముఖం ఎలా గుంటుందో చూ డా ల ని ఒకవుల్క వినువీధినుండి భూమాత వద్దకు చేరింది.

గత్యంతరం తోచక సత్యం పార్కునుండి బయటపడి తన కుటీరానికి చేరుకున్నాడు.

రాత్రి కన్య చీకటి ముసుగుని వేసుకుంది. ఆకాశం మీద నక్షత్రాలు తోబూచులాడుకుంటున్నాయి. మేఘాల వికలంగా చలిస్తున్నాయి. విజయనగరం గాఢ సుషుప్తిలో మునిగిపోయింది. రోడ్లపై అక్కడక్కడ రక్షక భటులు పహరాను యిస్తారు. పోలీసులు సరిగ్గానే పహరాను యిస్తున్నారని వొప్పుకుంటున్నట్లుగా రోడ్ల కిరుపైపులనున్న తరులు తలలూపుతున్నాయి. మధ్య మధ్య విను వీధినుండి వుల్కలు రాలుతున్నాయి. ప్రక్క సందులలో నుండి కుక్కలు మొరుగుతున్నాయి.

♦ ♦ ♦

కోళ్ళు కూస్తున్నాయి, పక్షులు కిలకిలారావములు చేస్తున్నాయి. ప్రాగ్దిశను సూర్యుడుదయిస్తున్నాడు. క్రమక్రమంగా పూర్తిగా తెల్లవారిపోయింది. కార్మిక - కర్షకులు తమ తమ పనుల మీదకు వెళ్ళిపోతున్నారు విశ్రాంతినొందిన తనువులతో.

విజయనగరం మ్యూనిసిపల్ హైస్కూలు మొదటి గంటకొట్టారు. స్కూలులోనికి విద్యార్థులందరూ చేరు కుంటున్నారు. మనకు పరిచయం అయిన ముగ్గురు అమ్మాయిలు కూడా చేరుకున్నారు. స్కూలు ఆవరణ లోనికి; సత్యం మాత్రం వారి వెనకలేడు. ప్రతిరోజు వారి వెనుకనే వచ్చే సత్యం నేడు రాకపోవటానికి కారణం?

మైదానంలో అందరు విద్యార్థులు, విద్యార్థినులు బారులు తీర్చి తరగతుల వారీగా నిలబడి వున్నారు. సరోజ, నిర్మల, అనసూయ ప్రతి రోజూ సత్యం నిల బడే వంక చూసారు. అతడక్కడలేడు. చుట్టు ప్రక్కల కలయ జూశారు. కాని ఎక్కడా కానరాలేదు. ఆల స్యంగా వస్తాడేమో! లేక స్కూలుకు సెలవు పెట్టాడో.

రెండవ గంట కొట్టారు. ప్రతిరోజూ ప్రారంభంలో 'వందేమాతరం' పాడుతుండేవారు. అలాంటిదీరోజు 'జనగణమన' పాడేసరికి చాలా మందిని ఆశ్చర్యం కలి గించింది.

అకస్మాతుగా స్కూలుకు శలవు లభిస్తుందంటే ఆ ప్రార్థన గీతమే చిహ్నం. ప్రార్థన అయిన తరువాత ఏమి

వార్త వినవలసి వస్తుందో నన్న భయంచేత సూర్యుడు మేఘాల చాటున దాక్కొనాడు. ఎవరైనా నాయకులు చనిపోయారో లేక ఏదైనా అఘాయిత్యం జరిగిందా తెలియక కొందరు తికమకలు పడుతున్నారు. ఎవరెలాపోతే మాకేం, మాకు శలవు లభిస్తుంది కదా అన్న వుత్సాహంతో మరికొందరు విద్యార్థులున్నారు.

ప్రార్థన సమాప్తమయింది. ప్రధానోపాధ్యాయులు గొంతు సవరించుకున్నారు –

'ఈ రోజు శలవు. ఎందుచేత నంటే, సత్యం అనే పేరుగల ఫిప్తుఫారం విద్యార్థి మరణించాడు. భగవంతుడాతని ఆత్మకు శాంతిని చేకూర్చుగాక!'

ఇవి వినగానే సరోజ, నిర్మల, అనసూయ తమ కాళ్ళ క్రిందనున్న భూమి భూకంపంవచ్చి బ్రద్దలవుతున్నట్టుగా తోచింది; నెమ్మది నెమ్మదిగా ధైర్యాన్ని తెచ్చుకొని అక్కడినుండి ముగ్గురు అమ్మాయిలు కదిలారు. విషాద హృదయాలతో, ఖిన్న వదనాలతో.

'ఈ సత్యంలా రోజు కొక్కడు మరణిస్తే బాగుంటుంది,' అన్నాడు రోజూ స్కూలు ఎగగొట్టే వుద్దేశం గల వొక విద్యార్థి.

'పాపం ఎందుకు మరణించాడో తెలియదు,' అన్నాడు సత్యం మీద సానుభూతి చూపే వుద్దేశ్యంతో వొక కనికర హృదయంగల విద్యార్థి.

అందరూ స్కూలునుండి బయట పడ్డారు. ఆఖరున ముఖద్వారంవద్ద మన పరిచయ స్త్రీల కనుకొలకులనుండి కొన్ని అశ్రుబిందువులు నేల మీదకు వారిగాయి. కాని సత్యం ఎందుకు మరణిచచాడో యిప్పటికీ ఎవరికీ తెలియదు, ఇక తెలియదు, ఇక తెలియబోదు కూడా,

నిన్న పార్కునుండి నిర్మల సత్యంకు చీవాట్లుపెట్టి బయలుదేరిన తరువాత దారిలో కోదండరావు కనిపించాడు, కోదండరావుకు తన కోరికను తెల్పింది నిర్మల. కాని తన కింతకు ముందే వివాహమైపోయించని జరిగిన సంగతినంతా తెలిపాడు కోదండరావు. పాపం ఖిన్న వదనంతో నిర్మల తననిలయానికి దారి తీసింది.

నిర్మల. వెళ్ళిన తరువాత సరోజ సత్యాన్ని కలుసుకుంది. తన మనస్సులోని కోరికను చెప్పింది. అతడు తృణీకరించాడు.

◆ ◆ ◆

అనుసూయ సత్యానికి తనసోదర ప్రేమను వెల్లడించలేక పోయింది. సత్యం చనిపోయిన తరువాత అనిత జీవితాంశములను తలంచుకుని లోలోపలే ఏడుస్తూవుంది. సత్యం చనిపోయినప్పటికీ మరల బ్రతికి వస్తాడని తలుస్తూ వుంది.

అనుసూయ సత్యాన్ని అన్నగా భావిస్తుందీ సరోజ ఆతన్ని తన ప్రియునిగా భావిస్తూన్నది. నిర్మల తనమనస్సును మార్చుకొని సత్యాన్ని తన ప్రియునిగా తలంచింది. కాని వీరి ముగ్గురి కోరికలు జల తరంగాలే. ఆతడిక వీరికి కనిపించడు.

◆ ◆ ◆

మీ రెప్పుడైనా విజయనగరం వెళ్ళితే అతడు నివసించిన పాతపాడుబడిన కుటీరం దగ్గరకు అర్ధరాత్రి పూట వెళ్లండి. మీకు వొకమాట స్పష్టంగా వినవస్తుంది –

'నిర్మలా! నిన్ను ప్రేమిస్తున్నాను.'

పండిత డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
Diamond Jubilee
1898 1958
ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్) లిమిటెడ్,
మదరాసు-17.